# అక్షర సత్యాలు

ఆ ఊరిపేరు రాళ్ళపల్లి.

ఎటుచూచినా కుప్పలు తెప్పలుగా మొలిచిన రాళ్ళురప్పలే తప్ప ఆ వూళ్ళో పచ్చదనానికి మచ్చుగా పచ్చికపరకైనా కనిపించదు. ఊరినిండా నిలువెత్తు రాతిగుండ్లు. ఆ గుండ్ల నడుమ మరుగుజ్జుల సమూహంలా చిన్నచిన్నపూరిపాకలు. ఊరిచుట్టూ ఆకలికీ రోగబాధకూ దారిద్ర్యానికీ విలవిలలాడి పోతున్న ముసలికట్టెల్లా నిలబడ్డ ఎండిన మోళ్ళు, వాటికవతల రేపటి ఆశల్లా మిలమిలలాడుతూ కనిపించే ఎండమావులు, వాటి వెనక దూరదూరాల్లో - మొండిగానైనా సరే, బతికి తీరవలసిందే అనే సందేశానికి సంకేతంగా తెగబలిసిన చింతచెట్లు. ఇవీ ఆ ఊరి రూపురేఖలు.

రాళ్ళపల్లిలో నివాసం వుంటున్నవారిలో నలుగురైదుగురు సన్నకారు రైతులు మినహా తక్కినవాళ్లంతా కేవలం తలదాచుకోటానికి తాటాకంత నీడకోసం మాత్రమే ఆ వూరిని ఆశ్రయించుకొన్నారు. జానెడు కడుపు అన్నది దేవుడిచ్చిన శాపమైతే, కాళ్ళూ చేతులే వాళ్ళకు ఆస్తులూ ఉపాస్తులూ! కాయకష్టాన్ని నమ్ముకున్న వాడికి పట్నంలో కూడు దొరుకుతుందిగానీ, గూడు దొరకదు కదా? అందుకే టౌనుకు రెండు కిలోమీటర్ల దూరంలో - రాళ్ళపల్లిలో - భూ బకాసురులకు పనికిరాని ప్రభుత్వ పోరంబోకు భూముల్లో నీడ వెతుక్కున్నారు ఆ బక్కప్రాణులు.

రాళ్ళపల్లి నడుమ దారిచేసుకుంటూ బస్సురోడ్డు పోతుంది. ఊరి మధ్య రోడ్డు పక్కనే రచ్చబండ. రచ్చబండను ఆనుకుని వున్న పూరిపాకే రాళ్ళపల్లి ఎలిమెంటరీ స్కూలు. నేను ఆ స్కూలులో సింగిల్ టీచర్ని!

బడిలో దాదాపు ఏభైమంది పిల్లల పేర్లున్నాయి. వాళ్ళలో సగంమంది క్రమంగా బడికి రారు. తమ ఆవునో మేకనో మేపుకొంటూనో, తల్లిదండ్రులిద్దరూ

కూలీనాలీకి వెళ్ళిపోతే ఇంటికి కాపలా కాస్తూనో, చెల్లినో తమ్ముణ్ణో ఆడించుకుంటూనో, చెట్లవెంటా పుట్టలవెంటా తిరుగుతూనో గడిపేస్తుంటారు.

పోనీ బడికి వస్తున్న వాళ్ళకైనా చదువులబ్బితే సంతోషించవచ్చు. కానీ ఆ సంతోషమే నాకు దక్కలేదు.

చదువుకుంటే పిల్లలు సుఖపడతారన్న నిశ్చితాభిప్రాయం అందరికీ వున్నట్టే నాకూ వుంది. పిల్లలకు శ్రమపడి చదువునేర్పి, మంచి ఉపాధ్యాయుడన్న పేరుతెచ్చుకోవాలన్న ఆరాటం నాది. కనుక శ్రద్ధగా చెబుతాను. చెప్పినంతసేపు వింటున్నట్టే కనిపిస్తారు. నేను పలికింది పలుకుతారు. అక్షరాలు దిద్దించితే దిద్దుతారు. చదవమంటే చదవలేరు, రాయమంటే రాయలేరు. ఇక గణితం, భూగోళం, చరిత్ర వంటివి ఏం చెప్పగలం? ఆ అమాయకపు లేలేత పేద తలకాయలకు అవి మహా పర్వతాలాయె! వాటి భారానికి తట్టుకుని నిలబడగలరా వాళ్ళు?

నెలరోజుల పాటు భిన్నాలను గురించి చెప్పిన తరువాత, "ఒకటీ బై రెండు, ఒకటీ బై నాలుగు, మూడూ బై నాలుగు – వీటిలో సజాతి భిన్నాలు ఏవీ? విజాతి భిన్నం ఏదీ? ఎవరు చెప్తారు?" అంటే ఏ ఒకరో ఇద్దరో తప్ప మిగిలిన వాళ్ళంతా బిక్కమొహాలు వేస్తారు.

మేజా మీద గ్లోబు తిప్పుతూ పాఠం చెబుతుంటే, గుడ్లప్పగించి గ్లోబువైపు నోళ్లు తెరుచుకుని చూస్తారు తప్ప, ఉష్ణమండలం, సమశీతోష్ణమండలం, శీతల మండలం అనేవి ఏమిటో వాళ్ళకు అంతుబట్టదు.

"భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్ర అనే పాఠం తీయండి" అనగానే అందరూ ఒక్కసారిగా ఆవలింతలు మొదలెడతారు.

ఈ విజ్ఞాన సర్వస్వమంతా అలా పక్కనపెట్టి, కనీసం చదవటం, రాయటం వాళ్ళకు నేర్పగలిగితే నేను మొనగాడికింద లెక్క! అయితే అది సాధ్యపడితే కదా? ఐదో తరగతిలో కూడా బొత్తిగా అక్షరాలు రానివాళ్ళున్నారంటే ఏమనాలి? వాళ్ళకసలు చదువుపైన ధ్యాసే లేనప్పుడు ఎన్ని సాముగరిడీలు చేసినా ఏం ప్రయోజనం?

పిల్లలు బడికొచ్చేది సంవత్సరంలో రెండు వందల రోజులే! అందులోనూ వాళ్ళు ఉపాధ్యాయుల సామీప్యంలో వుండేది – రోజులో ఐదుగంటలు మాత్రమే! వాళ్లు ఎక్కువకాలం గడిపేది ఉపాధ్యాయుడి దగ్గరకాదు. తల్లిదండ్రుల దగ్గరే!

పిల్లలు చదువరులు కావాలంటే, అందుకు జరిగే దోహద క్రియలన్నిటితో బాటు, తల్లిదండ్రులకు తమ పిల్లల చదువు సాముల పట్ల శ్రద్ధాసక్తులుండాలి. వాళ్ళను పరిశీలిస్తూ వుండాలి. పట్టించుకుంటూ వుండాలి.

రాళ్ళపల్లిలో మా బడి పిల్లల తండ్రులు ఎలాంటివారు? పొద్దు మొలిచింది మొదలు పొద్దుగూట్లో పడేదాకా సాగే జీవనపోరాటంలో కత్తిదించని కదనవీరులు. రాళ్ళు పగలగొట్టే రహీంసాయిబు, రిక్షా తొక్కే లోకనాథం, మూటలు మోసే మునుసామీ, దూది ఏకి దిండ్లూ పరుపులూ కుట్టే దస్తగిరి, హొటల్ లో దోసెలు పోసే ఉన్నికృష్ణన్, కట్టెలు చీల్చే కాటమరాజు, పిండిమిల్లు డ్రైవరు పెంచలయ్య మొదలైన కష్టజీవులంతా అలసి సొలసి యింటికొచ్చి కంటినిండా కునుకు తియ్యాలని కోరుకుంటారుగానీ, తమ పిల్లల చదువు సంధ్యల సంగతి వాళ్ళకేం పట్టింది?

ఇలాంటి ఊళ్ళో, ఇలాంటి పిల్లల్తో నేను చేయగలిగిందేముంది?

పారమార్థిక పరిభాషలో ముక్తికి మూడుమార్గాలు చెబుతారు వేదాంతులు. జ్ఞానమార్గం, కర్మమార్గం, భక్తిమార్గం. ఎవరికి ఏది పట్టుబడితే అది.

అలా నేను కూడా సూక్ష్మంలోమోక్షం అన్నట్లు సిలబస్ గుదిబండల్ని వదిలించుకుని పిల్లల స్థాయికి తగ్గట్టు అక్షరాలు, చిన్నచిన్న పదాలు, రెండు మూడంకెల సంఖ్యలు, చిన్న చిన్న కూడికలూ తీసివేతలు, కథలూ కబుర్లూ చెప్పటం వరకే పరిమితం కాక తప్పలేదు.

ఈ పిల్లలు బడిపాఠాల్లో మందబుద్ధులయినా పనిపాటుల్లో మాత్రం కుశాగ్రబుద్ధులని చెప్పక తప్పదు.

'మయుడు' అనే ముద్దు పేరుతో ఓ కుర్రాడున్నాడు. రాళ్ళు రప్పలతో ఎగుడు దిగుడుగా వున్న బడి ఆవరణను పిల్లలచేత చదును చేయించాలనుకుంటే, ఆ పనికి నాయకత్వం వహించేది మయుడే. వాడు స్వయంగా తానే ఇంటినుంచి పలుగూ పారా తెస్తాడు. నేల తవ్వుతాడు. తక్కిన పిల్లల్ని పురమాయించి, దిగ్విజయంగా పని పూర్తిచేస్తాడు.

మట్టితో కట్టిన బడిగోడలు పెచ్చులూడిపోతే, మయుడు చూస్తూ వూరుకోడు. రెండు వెదురుబుట్టలు తీసుకుని నలుగురు నేస్తగాళ్ళను వెంటబెట్టుకుని చేలల్లోంచి ఎర్రమట్టి తెచ్చి పడేస్తాడు. నీళ్లు తెచ్చి మట్టి పిసికి తన చేతులతో గోడ బాగుచేస్తాడు.

చక్రవర్తి అని మరో కుర్రాడున్నాడు. సైకిల్ కనిపిస్తే వాడి చేతులు చిమచిమలాడతాయి. ఇంటి దగ్గర వాడు హోమ్‌వర్క్ చెయ్యడు. వీధిలో ఎవరైనా సైకిల్ నిలబెట్టితే చాలు, వాళ్ళు చెప్పకపోయినా దాన్ని తుడుస్తూ, వొదులైపోయిన నట్లూ బోల్టులూ బ్రేకులూ బిగిస్తూ, చక్రం గిర్రున తిప్పి వంపులేమైనా వున్నాయా చూస్తూ శల్యపరీక్షలు చేస్తుంటాడు.

"ఎట్లా వేగేదిరా నీతో? చెప్పింది చదువుకోవు. ఇంటి పాఠమైనా రాసుకొని రావు. ఇట్లయితే నిన్ను ఆరోతరగతికి పంపేదిలేదు" అని కసురుకుంటాను.

అప్పుడు వాడంటాడు, "నేను హైస్కూల్లో చేరేదిలేదు సార్! ఐదో తరగతి అయిపోయినాక నన్ను సైకిల్ షాపులో పెడతాడంట మా నాయన!"

ఆంజనేయులు అనే అక్షరాలు రాని మేథావి యింకొకడున్నాడు. వాడి ముఖం ఎప్పుడూ తేటగానే ఉంటుంది.

ఓసారి వాడు వరసగా నెలరోజులు బడికి రాలేదు. కారణం చాలా బలమైనదే! అది చింతకాయల సీజన్. ఆంజనేయులు సంచీ ఒకటి చంకకు తగిలించుకుని, గాలికి రాలిపడే కాయల్ని ఏరుకుంటూ పొద్దస్తమానమూ చింతచెట్ల వెంబడి తిరిగాడు. అలా నెలరోజుల పాటు సేకరించిన కాయల్ని వాడే ఎండబెట్టి, బొబ్బళ్ళు తీసి, పండు నలగ్గొట్టి, గింజలూ ఈనెలూ వేరుచేసి, పట్నం సంతలో ఇరవై కిలోల చింతపండు అమ్మి, వాడికీ వాడి చెల్లికీ కొత్తబట్టలు కుట్టించుకున్నాడు.

అదే విధంగా చలికాలంలో గుట్టలన్నీ గాలించి సీతాఫలం చెట్లలోంచి కాయలు కోసుకొచ్చి యింట్లో మాగబెట్టి, మార్కెట్లో అమ్ముతాడు. ఎండాకాలంలో చింతచిగురు కోసి అమ్ముతాడు.

వాడి అభిరుచి కనిపెట్టి చింతపండు, సీతాఫలం, వంకాయలు, మామిడికాయలు అంటూ వాడికి కొన్ని కాయలూ పళ్ళ పేర్లు రాసిచ్చాను. కొద్దిపాటి తప్పులతోనైనా ఆంజీ ఆ మాటలు నేర్చుకోగలిగాడు. వారం పొడుగునా ఏ రోజు ఏ వూళ్ళో సంత జరుగుతుందో వాడికి బాగా తెలుసు.

"మనకు దగ్గర్లో ఏయే వూళ్ళల్లో సంత జరుగుతుందిరా ఆంజిగా?" అని అడిగాను.

"పాకాల, పెనుమూరు, దామల్ చెరువు, పాటూరు, ఐరాల, కల్లూరు, పీలేరు" అంటూ కొన్నిపేర్లు చెప్పాడు వాడు. ఆ పేర్లు రాసిచ్చాను.

రోడ్డుమీద వెళ్తున్న బస్సుల నెత్తికేసి చూసి, తాను నేర్చుకున్న పేరేదైనా అక్కడుంటే టకీమని చెప్పేయటం కొన్నాళ్ళకే వచ్చేసింది వాడికి.

అంకెలూ, వాటి స్థాన విలువలూ వాడికి బోధపడలేదు గానీ, "కిలో ఎర్రగడ్డలు ఒకటింపావలా. మనం ఎనిమిది కిలోలు కొని పది రూపాయల నోటు అంగడివాడికిస్తే, వాడు మనకు తిరిగి ఇయ్యాల్సింది ఎంతరా?" అనిఅడితే, తడుముకోకుండా చెప్పేస్తాడు ఆంజీ -"మనకు తిరిగి ఇయాల్సింది ఏమీలేదు సార్, పదిరూపాయలు సరిపోయింది" అని.

పాపం, వాడి చేతిలో పెన్ను మాత్రం - మూగది.

ఇక చివరిగా చెప్పుకోవల్సినవాడు - ఒక్కడున్నాడు. సత్యమూర్తి! బుద్ధికి బృహస్పతి! వాడి తండ్రి కొండమనాయుడిదే పుత్రోత్సాహమంటే! కొండమనాయుడు ఒక చిన్నరైతు. "అయివోరా! ఎట్టుండాడు మా సత్తిగాడు?" అని తరుచుగా అడుగుతుంటాడు.

"మీ వాడికేం కొండన్నా? కల్తీలేని బంగారం! ఈ ఇలాకాకే పేరు తెస్తాడు చూస్తావుండు!" అంటుంటాను నేను.

సత్యమూర్తికి యింట్లో వాళ్ళు ఏ పనీ పురమాయించేవాళ్ళు కాదు. వాడేమో, వాడి చదువేమో!

వేసవి సెలవుల తరవాత జూన్‌లో స్కూళ్ళు తెరచినప్పుడు - ఐదోతరగతి పూర్తిచేసిన వాళ్ళ కందరికీ రికార్డు షీట్లు యిచ్చేశాను.

సత్యమూర్తిని కొండమనాయుడు టౌనులో వున్న హైస్కూల్లో చేర్పించాడు. శ్రమ లేకుండా స్కూలుకు వెళ్ళిరావటానికని కొత్త సైకిలు కొని యిచ్చాడు. టౌనులో ఎవరైనా మంచి టీచరు దగ్గిర ట్యూషన్‌లో చేర్పించాలనుకుంటున్నట్లు చెప్పాడు.

గోడకు మట్టివేసిన మయుడు, సైకిల్ చక్రవర్తీ, చింతకాయల ఆజంనేయులూ - వీళ్ళెవరూ హైస్కూల్‌లో చేరలేదు.

ఇంతలో నాకు ట్రాన్స్‌ఫర్ వచ్చింది. మరో మూల - మరో ఊరు వెళ్ళిపోయాను. పంతుళ్ళకు ఎక్కడుంటే అదే లోకం! ఇరవై ఏళ్ళు దొర్లిపోయాయి. రెండు మూడు స్కూళ్ళు మారాను. రాళ్ళ పల్లివైపు మళ్ళీ నేనెప్పుడూ నిక్కచూడలేదు.

ఇప్పుడు - ఇన్నేళ్ళ తరవాత మళ్ళీ రాళ్ళపల్లికి బదిలీ చేశారు. వెళ్ళి జాయిన్ అయ్యాను. ఇప్పుడది అప్పర్ ప్రైమరీ స్కూలు. నిలువెత్తు రాతిగుండ్లు ఏమై పోయాయో, ఊరు బాగా పెరిగింది.

అలనాటి చింతకాయల ఆంజనేయులు, కొండమ నాయుడి కొడుకు సత్యమూర్తీ వగైరా కుర్రవాళ్ళు ఇప్పుడెలా వున్నారో, ఏం చేస్తున్నారో అన్న ఆసక్తి ఉండనే ఉంది. కొందర్ని చూడటం, కొందరి సంగతి సందర్భాలు తెలుసుకోవటం చాలా తేలికగానే అయింది.

నా చిన్ననాటి శిష్యులందరూ ఏదో విధంగా బతుకుతున్నారు. కొందరు వాళ్ళ కుటుంబ వృత్తుల్లో వున్నారు. ఒకరిద్దరు ఏవో స్థానిక సంస్థల్లో చిన్న

ఉద్యోగాలు వెలగబెడుతున్నారు. అంతో యింతో పొలాలున్నవాళ్ళు వ్యవసాయం చూసుకుంటున్నారు. చిన్నాచితకా వ్యాపారాలు చేసుకుంటున్నారు కొందరు.

కొండమనాయుడు సత్యమూర్తిని ఎం.ఏ. పట్టభద్రుణ్ణి చేసి, కూతుర్ని ఒక అయ్య చేతిలో పెట్టేసరికి, ఉన్న కొద్దిపాటి కొండ్రా హారతి కర్పూరంలా కరిగిపోయి, పూరిల్లు మాత్రం మిగిలింది. సత్యమూర్తి ఐదారేళ్ళ నుంచీ నిరుద్యోగిగా తిరుగుతూ, చాలీ చాలని ట్యూషన్లు చెప్పుకుంటున్నాడు. అతడి తండ్రి మంచాన పడ్డాడు. తల్లి పెంచుతున్న రెండు పాడిగేదెలే ఆ కుటుంబానికిప్పుడు జీవనాధారం!

చిన్నప్పుడు మట్టి పిసికి బడిగోడలు మరమ్మత్తు చేసిన మయుడనే వాడు ఇప్పుడు తాపీ మేస్త్రీగా వుంటూ రోజుకు ఏభై రూపాయలు సంపాదించుకుంటున్నాడు

'హైస్కూల్‌లో చేరను, సైకిల్ షాపులో చేరతా'నన్న చక్రవర్తి యిప్పుడు సొంతంగా సైకిల్‌షాపు నడుపుతున్నాడు. పగటి వేళల్లో తిండి తినటానికైనా తీరిక దొరకదట వాడికి!

ఇక పోతే ఆంజనేయులు. వాడికేం, మహారాజు. సంతల వెంబడి తిరిగి సరుకులమ్ముకోవడంతో ప్రారంభించి, ఇప్పుడు పట్నంలోనే పెద్ద కూరగాయల దుకాణం నడుపుతున్నాడు. వాళ్ళ నాన్న కట్టిన గుడిసెను వీడు మేడగా మార్చాడు. ఆ మేడలో ఫ్రిజ్ వుంది. టీవీ వుంది. ఇంట్లోనూ దుకాణంలోనూ ఫోన్లు కూడా వున్నాయి. ఆంజనేయులు యిప్పుడు జేబులో పెన్ను పెట్టుకుంటాడు. తెలుగు దినపత్రిక కూడా చదువుతాడు.

కొండమనాయుణ్ణి చూద్దామని వెళ్ళాను. నేనెవరో గుర్తు చేశాక, అతను తానే నా దగ్గర చదువుకున్నంతటి వినయంతో మంచంలోనుంచి లేచి కూచున్నాడు. "బాగుండావా అయివోరా?" అంటూ ఆప్యాయంగా నా చేతులు పట్టుకున్నాడు.

"నీ నోటివాక్కు ఫలించిందయివోరా! మా వోడు ఎం.ఏ. పట్టా తెచ్చుకున్నాడు. అంత చదువు చదువుకున్నోడికి ఉద్యోగం ఎందుకు రాదూ అంటా? ఈ పొద్దుగాకపోతే రేపు! నువ్వు వాడికి కొంచెం ధైర్యంజెప్పాలయివోరా" అన్నాడు. తపస్సు ఫలించిన ఋషికి మల్లే అతడి కళ్ళల్లో వింతవెలుగు.

అయితే ఆ వెలుగు సత్యమూర్తి కళ్ళల్లో లేదు. నిస్తేజంగా అతను అంటాడు కదా-

"ఎందుకు పనికొస్తుంది సార్ నా చదువు? కోటివిద్యలు కూటికోసమే అని కదా సామెత? అది వొదిలిపెట్టి మనం అక్షరాలకు ప్రాధాన్యతనిస్తున్నాం. పదిహేడు

పద్దెనిమిదేండ్ల పాటు చదువు చదువు అని చదువులో మునిగి తేలుతూ నేనింకొక పనేదీ చెయ్యలేదు. రాయటం చదవటం నేర్చుకునేందుకు యింతకాలం గావాల్నా? జీవనాధారం అనే మాట రాయటం నేర్చుకున్నానుగానీ, ఏదో ఒక జీవనాధారం చూసుకోవటం నేర్చుకోలేదు నేను. నా చిన్ననాటి నేస్తాలు ఆ మాట రాయటం నేర్చుకోలేకపోయినా, జీవనాధారాన్ని ఎలా పట్టుకోవాలో నేర్చుకున్నారు. చదువుకున్న వాడికీ, చదువు ఒంటబట్టని వాడికీ వున్న తేడా యిదే! మొక్కై వంగనిది మ్రానై వంగదని మనకంటే వాళ్ళకే బాగా తెలుసు.

"సాంకేతిక పట్టభద్రులకే ఉద్యోగాలు లేక ఉసూరుమంటుంటే, మామూలు చదువుల వాళ్ళు చేయగల ఉద్యోగాలు ఏమున్నాయి? గుమాస్తా ఉద్యోగం. కాకపోతే టీచరు ఉద్యోగం. అంటే ఈ చదువుల ఉద్దేశం ఏమిటి? ప్రతివాడూ చదువుకుని, చదువుకున్న ప్రతివాడూ ఆ గుమాస్తా ఉద్యోగంకోసమో టీచరుద్యోగం కోసమో పోటీలు పడి, ఒకర్నొకరు కుమ్ముకుంటూ పడదోసుకుంటూ అదృష్టదేవతకు ముడుపులు గట్టుకుంటూ పరుగులు తియ్యాలనా? ఎందుకు సార్ ఈ చదువులు? యువకుల్లోని శ్రమశక్తినీ సృజనాత్మకతనూ చంపి, సోమరితనాన్నీ నిష్క్రియా పరత్వాన్నీ పెంచి జాతినే నిర్వీర్యం చేసే ఈ విద్యావిధానం వల్ల ఉపయోగం వుందంటారా సార్?

"సాంకేతిక విద్యాలయాలు, వైద్య విద్యాలయాలూ ఉంటే వుండనివ్వండి. నిత్యవ్యవహారాలకు ఉపయోగపడే అక్షరాస్యత కోసం ప్రాథమిక పాఠశాలలూ - వయోజన పాఠశాలలూ చాలు. పుట్టగొడుగుల్లా ఇన్ని హైస్కూళ్ళు, ఇన్ని జూనియర్ కాలేజీలూ, ఇన్ని డిగ్రీ కాలేజీలూ ఎందుకండీ? ఇవన్నీ వృత్తి విద్యాలయాలుగా మారితే, ఉపాధికీ సంపదకీ లోటేముంటుంది?.... ఈ కూడు పెట్టని చదువులు ఎందుకు చదువుకున్నానా అని పశ్చాత్తాపపడుతున్నాను సార్!"

సత్యమూర్తి మాట్లాడుతున్న సమయంలోనే, రాళ్ళ పల్లిలో బడి గంట టంగుటంగున మోగసాగింది. ఆ బడిగంటకు బ్రహ్మచెముడేమో! లేకపోతే సత్యమూర్తి మాటలు వినటానికి అది కొంతసేపు ఆగివుండేది. ■

● ఈనాడు ఆదివారం 19 ఆగస్ట్ 1990 ●